క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

రాజంపేట : రాజంపేట ఆర్టీసీ డిపో కార్యాలయంలో మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజరు రమణయ్య తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రయాణీకులు కార్యక్రమాన్ని సద్వినియోగపరుచుకోవాలన్నారు.

10న కారు వేలం

రామాపురం : మద్యం అక్రమ రవాణా కేసులో పట్టుబడిన కారును ఈనెల 10న వేలం వేయనున్నట్లు మండల ఎస్ఐ బీ.ఎల్.ప్రసాద్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30గంటలకు మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్ ఆవరణలో వేలం జరుగుతుందన్నారు. ఆసక్తి గలవారు వేలంలో పాల్గొనవచ్చునని తెలిపారు.

గ్రామాల్లో ప్రశాంతంగా జీవించాలి



ప్రజలతో మాట్లాడుతున్న ఎస్ఐ వెంకట ప్రసాద్

గాలివీడు : గ్రామాల్లో ప్రజలు ప్రశాంతంగా జీవించాలని మండల ఎస్ఐ వెంకటప్రసాద్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని కొర్లకుంట గ్రామాన్ని తనిఖీ చేసి ప్రజలతో మమేకమయ్యారు. గ్రామ స్థితిగతులను తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలుంటే శాంతియుతంగా పరిష్కరించుకోవాలని, అలా కానీ తరుణంలో తమ దృష్టి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. గ్రామాల్లో అల్లర్లు సృష్టించే వారిపై, అసాంఘిక కార్యక్రమాల పట్ల ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ అంజిరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

నందలూరు(రాజంపేట) : ఆడపూరు వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి, ఇంటర్మీడియట్ (ఇంగ్లిష్) ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎంవీ నాగమణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష మార్చి 10వ తేదీన ఉంటుందన్నారు. ఐదో తరగతిలో ప్రవేశానికి నాల్గవ తరగతి చదువుతున్న వారు అర్హులని, అలాగే ఇంటర్మీడియట్ ప్రవేశానికి పదో తరగతి చదువుతున్న వారు అర్హులన్నారు. ఉభయ వైఎస్సార్ జిల్లాకు చెందిన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఈనెల 23వ తేదీలోపు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఎలాంటి ఫీజు చెల్లించనవసరం లేదని చెప్పారు. వివరాలకు 9704550128 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

సన్మానం



నాయకులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పుల్లంపేట : ఎస్టీయూ సంఘానికి స్థానిక ఎమ్మార్సీలో ఉపాధ్యాయులు సత్కరించారు. సోమవారం పుల్లంపేటలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో నూతనంగా ఎన్నికైన జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు బుదారపు నరేంద్రనాథ్, ఉపాధ్యాయ జిల్లా కన్వీనర్ మునగపాటి శ్రీనివాసులు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రసాద్ రెడ్డిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంస్కృత పాఠశాల హెచ్ఎం చింతగింజర మురళీ, సయ్యద్ సర్తాజ్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శి వి.సిద్దయ్య, ఆర్థిక కార్యదర్శి శివరాం ప్రసాద్, నాయకులు అశోక్, గౌస్ పాల్గొన్నారు.

శభాష్ వలంటీర్



అక్కాయమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ శిరీషా

చిన్నమండెం : సీఎం జగన్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థతో సుదూర ప్రాంతంలో ఉన్న వారికి కూడా పింఛన్‌ను అందజేస్తున్నారు. మండలంలోని కలిబండ పాలిమేరపల్లెకు చెందిన డి.అక్కాయమ్మ ఆరోగ్యం సరిగా లేకపోవడంతో మదనపల్లెలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈమెకు మంజూరైన పింఛన్‌ను అందజేసేందుకు వలంటీర్ శిరీషా మదనపల్లె ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందజేశారు. పింఛన్‌దారు అక్కాయమ్మ వలంటీర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆరుగురు జూదరుల అరెస్ట్

మదనపల్లె : జూదం ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు సీఐ శేఖర్ తెలిపారు. సోమవారం మండలంలోని సీటీఎం క్రాస్ పంచాయతీ మిట్టపల్లె సమీపంలో జూదం నిర్వహిస్తున్నట్లు సమాచారంతో దాడులు నిర్వహించామన్నారు. దాడుల్లో మదనపల్లెకు చెందిన సూరిబాబు(36), జే.చలపతి(40), పి.వెంకటరమణ(42), జి.చంద్ర(35), నిమ్మనపల్లె మండలానికి చెందిన బి.రెడ్డెప్ప(45), కురబలకోటకు చెందిన ఏ.రామకృష్ణ(53)లను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారివద్ద నుంచి రూ.9,250 స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

బాధ్యతలు స్వీకరించిన అధికారులు

- ఎన్నికల నేపథ్యంలో తహసీల్దార్, ఎంపీడీఓల బదిలీలు
- ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు చేస్తామన్న అధికారులు



బి.జయన్న, తహసీల్దార్ రాయచోటి



సురేంద్రనాథబాబు, ఎంపీడీఓ, రాయచోటి



సంబేపల్లె: తహసీల్దార్‌ను సత్కరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

రాజంపేట రూరల్ : మండల తహసీల్దార్‌గా ఆర్. ఇస్నతన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు జిల్లా జీడీ నెల్లూరులో తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఆయన ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడకి బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న తహసీల్దార్ ముద్దా సుబ్రమణ్యంరెడ్డి చిత్తూరు జిల్లా పుంగనూరుకు బదిలీపై వెళ్లారు. ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తహసీల్దార్ తెలియజేశారు. మండలంలో శాంతియుతంగా ఎన్నికలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. బాధ్యతలు చేపట్టిన తహసీల్దారుకు రీసర్వే డీటీ ఎన్.హరిత, ఆర్ఐ కె.రాజేష్‌తోపాటు వీఆర్ఓలు, సర్వేయర్‌లు, సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

సంబేపల్లె తహసీల్దార్‌గా శ్రీనివాసులు

సంబేపల్లె : మండల తహసీల్దార్‌గా బి.శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు చేపట్టారు. బదిలీలో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శ్రీనివాసులు కర్నూలు జిల్లా నుంచి ఇక్కడికి వచ్చారు. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసులకు రెవెన్యూ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఆయన్ను శాలువాతో సత్కరించారు.

రాయచోటి ఎంపీడీఓగా సురేంద్రనాథ్

రాయచోటి అర్బన్ : రాయచోటి రూరల్ మండల ఎంపీడీఓగా సురేంద్రనాథ్ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎంపీడీఓగా పని చేసిన ఎ.మల్‌రెడ్డి ఎన్నికల బదిలీపై కర్నూలు జిల్లా అవుకు మండలానికి వెళ్లారు. కాగా ఆయన స్థానంలో అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె ఎంపీడీఓ సురేంద్రనాథబాబు రాయచోటి ఎంపీడీఓగా బదిలీపై వచ్చారు.

రాయచోటి తహసీల్దార్‌గా బి. జయన్న

రాయచోటి టౌన్ : రాయచోటి తహసీల్దార్‌గా బి.జయన్న బాధ్యతలు చేపట్టారు. సోమవారం ఆయన తన బాధ్యతలు చేపట్టేందుకు తన చాంబర్‌లోకి రాగానే సిబ్బంది అంత వచ్చి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఆయన కర్నూలు జిల్లా నుంచి ఇక్కడికి వచ్చారు.

నందలూరు ఎంపీడీఓగా శేఖర్ నాయక్

నందలూరు(రాజంపేట) : మండల పరిషత్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా బుక్కే శేఖర్ నాయక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గాలివీడులో ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ నేపథ్యంలో ఏఓ అనంత ప్రకాష్, ఏపీఓ ఢిల్లీబాబు, జూనియర్ అసిస్టెంట్ సుబ్రమణ్యం, టైపిస్టు అర్జున్‌లు ఆయనకు స్వాగతం పలికారు. బీసీ నాయకులు ఫల్గుణ యాదవ్, నందలూరు భాస్కర్ రెడ్డిలు మండల అభివృద్ధి అధికారిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆడపూరు పంచాయతీ సెక్రటరీ నరసింహులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వీరబల్లె ఇన్‌చార్జి ఎంపీడీఓగా రామచంద్రారెడ్డి

వీరబల్లె (రాయచోటి టౌన్) : వీరబల్లె మండలం ఎంపీడీఓగా రామచంద్రారెడ్డికి బాధ్యతలు ఎంపీడీఓ మల్లీశ్వరి అప్పగించారు. ఆమెకు కర్నూల్ జిల్లాకు బదిలీ అయ్యారు. దీంతో ఇన్‌చార్జిగా ఆయనను నియమిస్తూ బాధ్యతలు అప్పగించారు. ఆయన ఇక్కడే ఈఓపీఆర్‌డీగా పని చేస్తుండటంతో ఈ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెకు సహచర ఉద్యోగులు ఘనంగా వీడ్కోల్ పలికారు. కార్యక్రమం ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.



శేఖర్ నాయక్, ఎంపీడీఓ, నందలూరు



ఆర్.ఇస్నతన్, తహసీల్దార్, రాజంపేట



రామచంద్రారెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ, వీరబల్లె

లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవాలి



లోక్ అదాలత్‌పై సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

నందలూరు(రాజంపేట) : జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని కడప డిస్ట్రిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ పి.బాబా ఫకృద్దీన్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక కోర్టులో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ కె.లత ఆధ్వర్యంలో వచ్చేనెల 9న జరగబోవు లోక్ అదాలత్‌కు సంబంధించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబా ఫకృద్దీన్ మాట్లాడుతూ కక్షిదారులు తమ కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రతిరోజూ జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించి ఫ్రీ లోక్ అదాలత్ సిట్టింగ్‌లు నిర్వహించబడుతాయన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అడ్వకేట్లు, పోలీసులు, పీఎల్‌వీలు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

మార్చి 7న రాజంపేటలో లోక్ అదాలత్

రాజంపేట : మార్చి నెల 7న జరిగే లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని కడప సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి షేక్ బాబా ఫకృద్దీన్ తెలిపారు. సోమవారం ఆయన సబ్ జైలును ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం కోర్టులో న్యాయవాదులు, కోర్టు సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో కక్షిదారులకు మేలు జరిగేలా న్యాయవాదులు చొరవ తీసుకోవాలన్నారు. లోక్ అదాలత్‌లో న్యాయవాదుల సమస్యలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. సమావేశంలో సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ పసుపులేటి శంకర్, ఏపీపీ రెహానా రసూల్, న్యాయవాదులు సుదర్శన్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, లక్ష్మీనారాయణ, వెంకటస్వామి, కరుణాకర్ రాజులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఈ - కేవైసీ చేయించుకోవాలి



మాట్లాడుతున్న ఏఓ నాగమణి

రామాపురం : 2023 రబీ సీజన్‌లో సాగు చేసిన రైతులు తమ పంటలను ఈనెల 15వ తేదీ లోపు పంట నమోదుతోపాటు ఈ – కేవైసీ చేయించుకోవాలని రైతులకు మండల వ్యవసాయ అధికారిణి నాగమణి తెలిపారు. సోమవారం వ్యవసాయ కార్యాలయంలో మాట్లాడుతూ పంట సాగు చేసిన రైతులు పంట నమోదుతోపాటు ఈకేవైసీ తప్పనిసరిగా రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేయించుకోవాలన్నారు. రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు 75 శాతం ఈకేవైసీ నమోదు చేసుకున్నారని, మిగిలిన రైతులు తప్పకుండా ఈనెల 15వ తేదీలోపు చేయించుకుంటే ప్రభుత్వం నుండి వచ్చే పంట నష్టం వర్తిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సారా విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

మదనపల్లె : అక్రమంగా సారా విక్రయిస్తున్న మహిళను అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ వలీబాషు తెలిపారు. పట్టణంలోని వడ్డిపల్లె సమీపంలో సారా విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారంతో సిబ్బందితో కలిసి సారా విక్రయిస్తున్న జి.ఆదెమ్మ(70)ను అదుపులోకి తీసుకున్నామన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ వైరు చోరీ

పీలేరు : జాండ్ల పంచాయతీలో దుండగులు ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి రాగివైరు చోరీ చేశారు. వివరాలిలావున్నాయి. జాండ్ల గ్రామం నందకుమార్‌రెడ్డి పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి రాగి వైరును చోరీ చేశారు. సోమవారం ఉదయం విషయం తెలుసుకున్న బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విలువలతో కూడిన విద్యతోనే ఉపాధి

చిన్నమండెం : విలువలతో కూడిన ఉన్నత విద్యను అభ్యసించడం ద్వారా సరైన సమయంలో ఉపాధి పొందవచ్చునని కళాశాల ప్రిన్సిపల్ రమేష్ అన్నారు. సోమవారం స్థానిక ఆదర్శ పాఠశాలలో జాతీయ సేవా పతకం ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం నిర్వహించారు. పది, ఇంటర్ తరువాత ఏ విద్యను అభ్యసిస్తే ఎటువంటి ప్రయోజనాలు, ఉపాధి పొందవచ్చో రీసోర్స్ పర్సన్ సుబ్బరాయుడు కళాశాలలో ఏర్పాటు చేసిన కెరీర్ ప్లానింగ్ అండ్ గైడెన్స్ కార్యక్రమంలో పీపీటీ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ నవీన్‌కుమార్, ఆర్‌పీఎస్ నరసింహులు, రామరాజు, గోపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌కే ఒలంపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నందలూరు(రాజంపేట) : అబాకస్, వేదిక్ మ్యాథ్స్‌లలో ఆర్‌కే ఒలంపియాడ్ వారు నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభను కనబరిచిన శ్రీ అన్నమాచార్య అకాడమీ హైస్కూల్ విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ సమ్మెట శివప్రసాద్ సోమవారం అభినందించారు. కోడూరులో ఆదివారం జరిగిన పోటీలలో 17 పాఠశాలల విద్యార్థులు 400 మందికి పైగా పోటీపడగా నందలూరు మండలం నుంచి శ్రీ అన్నమాచార్య అకాడమీ హైస్కూల్ విద్యార్థులు 21 మంది పోటీలలో పాల్గొన్నారని, వారిలో 8 మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచి ప్రథమస్థానంలో ఇద్దరు, ద్వితీయ స్థానంలో ముగ్గురు, తృతీయ స్థానంలో ముగ్గురు విజేతలుగా నిలిచినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలాంజనేయులు, డైరెక్టర్స్ మాదపూరి హేమలత, ఉమా మహేష్, ఉపాధ్యాయులు షమీవుల్లా, స్రవంతి, లక్ష్మీ ప్రియాంక, శివకుమారి, గోపిక తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళి సమేత వీరభద్రుడికి పల్లకీ సేవ



మాఢ వీధుల్లో స్వామి వారిని ఊరేగిస్తున్న అర్చకులు, ఆలయ అధికారులు, భక్తులు

రాయచోటి టౌన్ : రాయచోటి భద్రకాళి సమేత వీరభద్రస్వామిని పల్లకీలో ఊరేగించారు. సోమవారం స్వామి వారిని, అమ్మవారి మూల విరాట్‌లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి అందంగా అలంకరించారు. అనంతరం ఉత్సవ మూర్తులకు పూజలు చేసి అలంకరించి పల్లకీలో ఉంచి ఆలయ మాఢ వీధులలో ఊరేగించారు. ఈ పల్లకీ సేవలో స్థానిక భక్తులతోపాటు కన్నడ భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమం ఆలయ ఈఓ డివి రమణారెడ్డి, ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాలను అందజేశారు.

క్యాన్సర్‌ను సకాలంలో గుర్తించాలి

మదనపల్లె సిటీ: క్యాన్సర్ వ్యాధిని సకాలంలో గుర్తించి తగిన చికిత్స తీసుకోవాలని రిటైర్డు డీఎంహెచ్‌ఓ పూల వెంకటరమణ అన్నారు. సోమవారం స్థానిక అమ్మచెరువు మిట్టవద్దనున్న వెలుగు ప్రత్యేక పాఠశాలలో ప్రపంచ కేన్సర్ డేను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేన్సర్ అనేది శరీరంలోని కొన్ని కణాలు అనియంత్రితంగా అభివృద్ధి చెంది శరీరంలోని ఇతర భాగాలకు వ్యాపించడం ద్వారా వస్తుందన్నారు. ప్రజలకు సరైన అవగాహన లేకపోవడం వల్ల రోగ నిర్ధారణ ఆలస్యమై మృత్యువాత పడుతున్నారన్నారు. ముఖ్యంగా మహిళలలో రొమ్ము కేన్సర్ కేసులను పాప్‌స్మియర్ టెస్టు ద్వారా ముందే గుర్తించవచ్చున్నారు. గర్భాశయ కేన్సర్ బారిన పడకుండా ముందస్తు వాక్సిన్ తీసుకోవాన్నారు. కార్యక్రమంలో వెలుగు కన్వీనర్ భాగ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ లీనా తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోండి

రామసముద్రం: ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం స్థానిక చెంబకూరులో ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా చెంబకూరు పోలింగ్ కేంద్రాలను ఎస్ఐ చంద్రశేఖర్ సెక్టోరియల్ ఆఫీసర్ గంగాధర్ , పోలీస్ సిబ్బంది, మహిళా పోలీస్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని , ఇతర అవాంఛనీయ సంఘటనలకు సహకారం అందించిన, ఇతర చర్యలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బాలికల చదువుతోనే నవ సమాజ నిర్మాణం

తంబళ్లపల్లె: బాలికల ఉన్నత చదువుతోనే కుటుంబాలు ఆర్థికంగా ఎదగడంతో పాటు నవ సమాజ నిర్మాణానికి దోహదపడుతుందని ఎంఈవో త్యాగరాజు అన్నారు. సోమవారం కస్తూర్బా బాలికల పాఠశాలలో 10వ తరగతి విద్యార్థినులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రణాళికబద్ధంగా చదివి మంచి మార్కులు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలతో సంతోషాన్ని పంచుకున్నారు.

పోలింగ్ స్టేషన్ల పరిశీలన

పీలేరు రూరల్ : మండలంలోని వివిధ పోలింగ్ కేంద్రాలను ఎన్నికల సెక్టోరియల్ అధికారులు టి.రెడ్డెప్ప, ఏఎస్ఐ రామకృష్ణ పరిశీలించారు. సోమవారం మండలంలోని ఏడు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని పోలింగ్ కేంద్రాల్లో సరైన వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులను ఉన్నత స్థాయికి తెచ్చేలా బోధనలు



విద్యార్థులకు ఇంగ్లీష్ పాఠ్యంశాన్ని బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

రాయచోటి టౌన్ : గత నవంబర్ నెలలో అన్ని ప్రభుత్వ పాఠశాలలలో నిర్వహించిన ఎల్ఐపీను(లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రాజెక్టు) విద్యాశాఖ అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా వ్యాప్తంగా బృందాల వారీగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు రాయచోటి ఎంఈఓ బాలాజీ నాయక్ తెలిపారు. రాయచోటి పట్టణ పరిధిలోని కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలను, కొత్తపేటలోని రామాపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు నిర్వహించిన పరీక్షలపై అవగాహన కార్యక్రమాన్ని కల్పించారు. ఈ అవగాహన కార్యక్రమంలో భాగంగా తెలుగు, ఇంగ్లిష్, గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టులపై విద్యార్థులకు మొదట ఉపాధ్యాయులు బోధన ద్వారా తరువాత ప్రయోగాత్మకంగా (ప్రాక్టికల్‌గా) విద్యార్థులలోని సృజనాత్మకను వెలికి తీసే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వారిలో గ్రేడ్‌లను ఇవ్వడంతోపాటు మిగిలిన వారిని ఉన్నత స్థాయిలోకి తీసుకొచ్చేందుకు ఎలాంటి బోధన పద్ధతిని అవలంబించాలనే విషయాలపై ఉపాధ్యాయులకు సూచనలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఏఎంఓ సమీవుల్లా, తెలుగు ఉపాధ్యాయుడు ఎం.మదన్‌మోహన్ నాయక్, ఇంగ్లిష్ బీఎస్ పద్మావతి, గణితం జి.శ్రీనివాసులు, జీవశాస్త్రం జి.వెంకటసుబ్బయ్య, సాంఘికశాస్త్రం ఎస్. వెంకటరమణలు పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన హోంగార్డ్‌లకు సత్కారం



హోంగార్డ్‌లను సన్మానిస్తున్న అడిషనల్ ఎస్పీ డాక్టర్ వీబీ రాజ్‌కమల్

రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్‌లలో విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందిన ఇద్దరు హోం గార్డ్‌లకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా సోమవారం అన్నమయ్య జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ కృష్ణారావు ఆదేశాల మేరకు అదనపు జిల్లా ఎస్పీ డాక్టర్ వీబీ రాజ్‌కమల్ ఆధ్వర్యంలో వీడ్కోలు సభ జరిగింది. పదవీ విరమణ పొందిన వారిలో రామాపురం మండలం పోలీస్ స్టేషన్‌లో ఉమెన్ హోం గార్డ్ (447) కెవి లక్ష్మమ్మ, మదనపల్లె ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో జాఫర్ (హెచ్‌జీ291) విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందారు. వారు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ మహబూబ్ బాషా, ఏఆర్ ఆర్ఐ అడ్మిన్ పెద్దయ్య, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న మహిళలు

రాయచోటి అర్బన్ : మున్సిపల్ పరిధిలో అర్హులైన పేదలందరికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఏపీ మహిళా సమాఖ్య అన్నమయ్య జిల్లా సమితి జిల్లా కార్యదర్శి మర్రి సుమిత్ర, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సిద్దిగాళ్ల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం పేదలందరికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలన్న డిమాండ్‌తో మహిళలు ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులందరికి ఇళ్ల పట్టాలు మంజూరు చేస్తున్నామని గొప్పలు చెబుతున్నప్పటికీ ఇంకా 1200 మందికి పైగా అర్హులైన వారు ఉన్నారన్నారు. ఇప్పటికైనా అర్హులందరికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలంటూ డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు ఈ మేరకు వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో అరుణ, సుబ్బమ్మ, సొదాకున్, నసీబ్‌జాన్, స్వప్న, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆహార సంరక్షణపై అవగాహన ఉండాలి



ఆహార సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

లక్కిరెడ్డిపల్లె : ఆహార సంరక్షణ, ఫుడ్ ప్రాసెసింగ్ పై అవగాహన కలిగి ఉండాలని కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపాల్ నాగలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం లక్కిరెడ్డిపల్లె వెంకటేశ్వర బేకరీలో విద్యార్థులకు ఫుడ్ ప్రాసెసింగ్ సభ్యురాలు వీర పద్మజ అవగాహన కల్పించారు. ఏఎండీ, రెస్టారెంట్‌లో ఆంధ్ర భోజనం తయారీ, కాంటినెంటల్, తందూరి, బిర్యానీ వంటి తయారీలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు షర్మిల, ఇంద్రజ, రాధ, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

8న అత్తిరాలలో టెంకాయల వేలంపాట

రాజంపేట రూరల్ : ప్రముఖ శైవ పుణ్యక్షేత్రమైన అత్తిరాలలోని కామాక్షి త్రేతేశ్వరస్వామి దేవస్థానంలో టెంకాయలు విక్రయించుకునేందుకు బహిరంగ వేలంపాటను 8న నిర్వహించనున్నట్లు దేవాదాయ శాఖ ఈఓ గన్నవరం కొండారెడ్డి తెలియజేశారు. సోమవారం ఆలయంలో ఈఓ కొండారెడ్డి విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. 8వ తేదీ గురువారం మధ్యాహ్నం వేలంపాట ఉంటుందన్నారు. వేలంలో పాల్గొనేవారు ధరావత్తు కింద రూ.50వేలు చెల్లించాలన్నారు. టెండర్ దక్కించుకున్నవారు ఈ నెల 9వ తేదీ నుంచి 2025 జనవరి 31వ వరకు టెంకాయలు విక్రయించుకోవచ్చునన్నారు. వేలం ముగిసిన వెంటనే డిపాజిట్‌తో కలిపి సగం నగదు చెల్లించాలన్నారు. మిగిలిన సగాన్ని పది రోజుల అనంతరం చెల్లించి తగు రశీదు పొందాలని చెప్పారు.

గ్రామ పంచాయతీ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం



భూమిపూజ చేస్తున్న నాయకులు, గ్రామస్తులు

పుల్లంపేట : గ్రామ పంచాయతీ నిధులు రూ. 20 లక్షలతో పుల్లంపేటలోని పలు వీధులలో ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి ఆధ్వర్యంలో సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి సీసీ రోడ్లకు భూమి పూజ కార్యక్రమం చేశారు. సీసీ రోడ్లను ప్రారంభించడంతో ఆయా వీధులలోని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గీతా రామనాథం, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నాగిరెడ్డి సుదర్శన్ రెడ్డి, సొసైటీ చైర్మన్ రంగారెడ్డి, సర్పంచ్ మణి, టి.కమ్మపల్లి ఎంపీటీసీ చెంగయ్య, నాగలపూరి గట్టు వార్డు మెంబర్ విజయలక్ష్మి, షేక్ అలీ జహారా బీ, వైఎస్సార్‌సీపీ నాయకులు సామా రాంబాబు, బీకే మణి, భోగా పార్థసారథి, పొలిచెర్ల బాల సుబ్రమణ్యం, వీసం సిద్దారెడ్డి, జై సింహా స్వామి, మైనార్టీ నాయకులు అలీ, పంచాయతీ కార్యదర్శి పెంచలయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాహనం వేలం

వాల్మీకిపురం : సీజ్ చేసిన వాహనాన్ని సోమవారం ఉదయం వేలం నిర్వహించినట్లు ఎస్ఐ నాగేశ్వర రావు తెలిపారు. క్వాలిష్ వాహనాన్ని రూ.36వేలకు పాడగా, జీఎస్టీతో కలిపి రూ.39,600లను ట్రెజరీలో జమ చేశామన్నారు.